క్లుప్తంగా

ఆలయ కమిటీ ఏర్పాటు

కర్నూలు కల్చరల్: ఓల్డ్ బస్టాండ్‌లోని ఇస్కాల కృష్ణ స్వామి టెంపుల్ నూతన కమిటీ గురువారం ఏర్పాటైంది. కమిటీ చైర్మన్‌గా కస్తూరి వెంకటేశ్వర్లు, సభ్యులుగా కె.రాజు, బి.సరస్వతి, బి.కుమారస్వామి, ఉదయప్రతాప్, ఆర్.వై.సురేష్, జ్యోతి, అనితా రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ప్రతిభ



కుశినేని తనూజ

కర్నూలు(హాస్పిటల్): నీట్ పీజీ ప్రవేశపరీక్షలో కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన కుశినేని తనూజ ప్రతిభ కనపరిచారు. గూడూరుకు చెందిన కుశినేని గిడ్డయ్య, సావిత్రి దంపతులకు నాల్గవ సంతానంగా జన్మించిన తనూజ కేఎంసీలో ఎంబీబీఎస్ చదివారు. ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో 573 మార్కులతో జాతీయ స్థాయిలో 6,675 ర్యాంకు దక్కించుకున్నారు. ర్యాంకు సాధించిన విద్యార్థినిని కుటుంబసభ్యులు, బంధువులు అభినందించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల అభివృద్ధి పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. శ్రీనివాస నగర్, ధర్మపేట, బంగారుపేట ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రీడాకారుల్లో పోటీతత్వం ఉండాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు పోటీతత్వంతో రాణించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. గురువారం సాయంత్రం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రగ్బీ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నూలులో వరుసగా మూడు సార్లు అస్మిత్ రగ్బీ పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. పోటీలను వినియోగించుకొని క్రీడాకారులు ఉన్నతంగా రాణించాలన్నారు. రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, జిల్లా సంఘం అధ్యక్షుడు గుడిపల్లి సురేంద్ర, ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

మహిళ మెడలోని చైన్ లాక్కెళ్లిన దుండగుడు

కర్నూలు: కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ చేశాడు. మేడమ్.. సార్ ఉన్నారా? అంటూ మంజుల అనే మహిళను మాటల్లో పెట్టి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని మూడున్నర తులాల పుస్తెల గొలుసును లాక్కున్నాడు. ఆమె పెనుగులాడటంతో పుస్తెలు మాత్రం చేతిలో మిగిలాయి. గొలుసు లాక్కొని మంజులను స్టోర్ రూమ్‌లో బంధించి గడియ పెట్టి అగంతకుడు పారిపోయాడు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ ఘటన జరిగింది. భర్త రామాంజనేయులు 2 గంటలకు ఇంటికి చేరుకుని భార్యను పిలవగా ఆమె స్టోర్ రూమ్ నుంచి మాట్లాడటంతో తలుపు గడియను తీశాడు. ఆమె బోరున విలపిస్తూ జరిగిన విషయం చెప్పింది. విషయం తెలిసిన పోలీసులు ఇంటి వద్దకు చేరుకుని చోరీ ఘటనపై ఆరా తీశారు. అయితే ఫిర్యాదు చేయడానికి మంజుల దంపతులు ముందుకు రాలేదు.

వైహెచ్‌సీఏ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఆదోని సబ్ కలెక్టర్

కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం (వైహెచ్‌సీఏ) అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి నాగరాజరావును ప్రభుత్వం తొలగించింది. జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంటు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన కొన్ని నెలలుగా పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన పనితీరుపై సంఘంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఉద్దేశపూర్వకంగా ఉద్యోగులను నుంచి తొలగించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సంఘం సెక్రటరీ, పర్సన్ ఇన్‌చార్జ్ మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం వల్ల సంఘం ప్రతిష్ట దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. వీటిని గుర్తించిన ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి నాగరాజరావును తప్పించింది. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్‌ను అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం.ఎమ్మిగనూరు చేనేత సంఘానికి పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఐఏఎస్ అధికారి నియమితులు కావడం ఇదే మొదటిసారి.

ఆర్టీసీ కార్మికులకు పాత పెన్షన్ అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ కార్మికులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జే.దివాకర్ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో కేసీ శేఖర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఈపీఎస్ 95 పథకంలోని హయ్యర్ పెన్షన్ సమస్యలతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా సక్రమంగా అమలు చేయడానికి ప్రభుత్వాలు నిరాకరించడం అన్యాయమన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా లేకపోయినా రాజస్థాన్, హిమచల్‌ప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగానే ఏపీలోనూ ఆర్టీసీ కార్మికులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు మాట్లాడారు. నాయకులు బి.శ్రీనివాసులు, ఎస్ఎస్ రావు, కె.జేఎం రావు, చంద్రమోహన్, పీవీ కుమార్, నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్తికా గణేశాయ..

పర్యావరణ హితాయ

- కొలువుదీరేందుకు సిద్ధమవుతున్న మట్టి వినాయక విగ్రహాలు
- పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో మట్టి ప్రతిమలకు పెరుగుతున్న ఆదరణ
- 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు




వెంగన్న బావి వద్ద సహజ రంగులు, మట్టితో తయారు చేసి విక్రయానికి ఉంచిన విగ్రహాలు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి రానే వచ్చింది. మరో వారం రోజుల్లో ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఊరువాడా అంతా ఇప్పటికే సందడి మొదలైంది. వినాయక చవితి సందర్భంగా ఏటా విగ్రహాల నిమజ్జనంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతూనే ఉంది. పీఓపీ అనర్థాలపై గణేష్ మహోత్సవ కేంద్ర సమితి, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయి. ఇటీవల పీఓపీ విగ్రహాల నిమజ్జనంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో కొంత మార్పు వస్తోంది. వినాయక చవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేసేశారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఏర్పడే పర్యావరణ సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది.

ఏటా పెరుగుతున్న విగ్రహాల సంఖ్య

వినాయక చవితి వేడుకల నిర్వహణలో రాష్ట్రంలోనే కర్నూలు నగరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రస్తుతం 45వ సంవత్సరం వేడుకలను నిర్వహిస్తున్నారు. రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయక చవితి ప్రస్థానం ఇప్పుడు 2400 విగ్రహాలకు చేరుకుంది. ఈ క్రమంలో ఏటేటా మట్టి విగ్రహాల ఏర్పాటు పెరుగుతూనే ఉంది. సుమారు 800 వరకు మట్టి గణనాథులను ప్రతిష్ఠించనున్నారు. కోల్‌కతా, గుజరాత్, రాజస్థాన్ నుంచి వచ్చిన శిల్ప కళాకారులు ప్రత్యేకంగా షెడ్లు వేసుకొని విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు గృహాల్లో పూజించుకోడానికి సుమారు 25 వేల చిన్న మట్టి విగ్రహాలను వివిధ స్వచ్ఛంద, ఆధ్యాత్మిక, ప్రజా సంఘాల వారు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. కొన్ని ఉత్సవ సమితులు ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాన్నే ఏర్పాటు చేసుకొని వేడుకలు జరుపుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సైంటిఫిక్ పరంగా ఇది ఉత్తమమైంది కావటంతో అటువైపుగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

పర్యావరణ హితమే పర్వదిన ఉదేశం

శుక్లాం భరధరం అంటూ హిందువులు తాము నిర్వహించే ప్రతి శుభకార్యానికి ముందు గణపతిని పూజ చేసి పని ప్రారంభిస్తారు. పంచ భూతాల్లో ఒకటైన మట్టితో చేసిన వినాయకుడిని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నది పండితుల మాట. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితం అవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి నీటిలో సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతం అవుతాయి.

మట్టి వినాయక విగ్రహాల విక్రయాలు పెరిగాయి



కర్నూలులో ఎనిమిది సంవత్సరాల నుంచి మట్టి వినాయక విగ్రహాలను తాయరు చేస్తున్నాం. ఏటేటా మట్టి వినాయక విగ్రహాల విక్రయాలు పెరిగాయి. బంక మట్టి, ఎర్రమట్టి, వరి గడ్డి, గోనెసంచులు, వెదురు కర్రలతో వాటర్ కలర్స్‌తో విగ్రహాలను తయారు చేస్తున్నాం. 5 నుంచి 16 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. రూ.15 నుంచి రూ.80 వేల వరకు డిజైన్, ఆకారం బట్టి ధర ఉంటుంది. ఇప్పటికే చాలా విగ్రహాలు బుక్ అయ్యాయి. సమాజ హితం కోసం అందరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– కెనెరాం పాల్, శిల్ప కళాకారుడు, పశ్చిమ బెంగాల్

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పర్యావరణానికి ముప్పే

ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న భారీ వినాయక విగ్రహాల్లో దాదాపు 80 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తాయారు చేసినవే ఉంటున్నాయి. బరువు లేకుండా ఆకర్షణీయంగా కనిపించడం కోసం తయారీదారులు ఎక్కువగా ఈ పదార్థాన్నే ఎంచుకుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు ఆలస్యంగా కరిగే గుణం ఉంది. ప్రతిమల్లో జిప్సం, సీసం, కాడ్మియం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, తదితర విష రసాయనాలు ఉంటాయి. ఇవి నీటిలో చేరినప్పుడు అందులోని ఆక్సిజన్‌ను తగ్గించి ఆమ్లత్వాన్ని పెంచుతాయని పర్యావరణ నిపుణుల ప్రయోగాల్లో తేలింది.

పర్యావరణానికి ముప్పు ఇలా..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఏళ్ల గడిచినా భూమిలో కలవదు.
- విగ్రహాలకు ఉపయోగించే రంగుల్లో సిలికా, జింక్, చాక్‌పీస్, గాజుపొడి కలుపుతారు. ఇవి నీటిలో కలిస్తే ప్రమాదకరం.
- ఎరుపు రంగు కోసం మెర్క్యూరీ సల్ఫేట్ వాడతారు. దీని వల్ల చర్మ వ్యాధులు, దద్దుర్లు వస్తాయి.
- నలుపు రంగు కోసం రెడ్ ఆక్సైడ్, కాడ్మియం, వాడతారు. వీటి వల్ల గ్రహణ శక్తి తగ్గుతుంది. మూత్ర పిండాల ఇన్‌ఫెక్షన్, పిల్లల శారీరక, మానసిక ప్రవర్తనల్లో మార్పులు వస్తాయి.
- నీలరంగు కోసం క్రోమియం, ఆయోడైడ్ వాడుతున్నారు. వీటితో అలర్జీ, ఉబ్బసం, న్యూమోనియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది,.
- గులాబీ రంగు కోసం పొటాషియం, డైక్రోమిట్ వాడుతున్నారు. వీటితో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- వినాయక నిమజ్జనోత్సవాలు, ఊరేగింపుల్లో, ఉట్టికొట్టే సమయాల్లో రంగుల వాడకంతో కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంది. కంటి పరమైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.

సంప్రదాయబద్ధంగా పండుగ జరుపుకుందాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయాలని ఏటా ఉత్సవ సమితి ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వినాయక ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి. సనాతన ధర్మంలో ప్రకృతిని పూజించే సంస్కృతి మనది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల ఏర్పాటును తగ్గించి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నాం. క్రమంగా మార్పు వస్తోంది. – **జి.వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి**

వాతావరణ కాలుష్య నివారణకు ముందుకు రావాలి



వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను పూజించడం అన్ని విధాలా శ్రేయస్కరం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలతో మానవాళికే కాదు జంతుజాలానికి ఎంతో ముప్పు. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలను కాకుండా మట్టి వినాయక ప్రతిమలనే ఏర్పాటు చేసుకొని పూజిస్తే సమాజ హితులమవుతాం.

– **వి.మధుమోహనమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ, అరికెర**



మట్టితో వినాయక ప్రతిమలను తయారుచేస్తున్న విద్యార్థులు

మట్టి వినాయకులను పూజిద్దాం

కర్నూలు(సెంట్రల్): వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణానికి మేలు చేద్దామని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఇంజినీర్ పీవీ కిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమల తయారీపై పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి వినాయకులనే పూజించాలని, ప్రతిమల తయారీలో సహజ రంగులనే వాడాలని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను వినియోగించవద్దన్నారు. విగ్రహాల తయారీ, అలంకరణ, పూజ, ప్రసాద పంపిణీలో ఏ దశలోనూ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. వినాయక పూజలో వినియోగించే సామగ్రి, ఇతర వస్తువులను నిమజ్జనం చేసి, ఆ నీటిని మొక్కలకు ఉపయోగించాలన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. శాస్త్రీయాధికారి డాక్టర్ జి.నరసింహులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాము తయారుచేసిన మట్టి వినాయక ప్రతిమలను చూపుతున్న విద్యార్థులు

డీఎస్సీ మెరిట్‌లిస్టు విడుదల చేయాలి

- పాత పద్ధతిలోనే టీచర్ పోస్టుల భర్తీకి డిమాండ్

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ అభ్యర్థులను గందరగోళానికి గురి చేసేవిధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందని, పాత పద్ధతిలోనే డీఎస్సీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. డీఎస్సీ పోస్టుల భర్తీలో ముందుగా జిల్లాల వారీగా మెరిట్ లిస్టులు విడుదల చేయాలని, తరువాత ర్యాంకులను విడుదల చేసిన తరువాతనే సెలక్షన్ జాబితాలను విడుదల చేయడం పారిపాటన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అభ్యర్థులను అయోమయంలోకి నెట్టేందుకు ఏకంగా పోస్టులకు ఎంపికైన వారి సెల్‌ఫోన్లకే మెసేజ్‌లు ఇచ్చేందుకు నిర్ణయించడం అన్యాయమన్నారు. ఈ విధానంలో పాదదర్శకతకు చోటు ఉండదని, పాతపద్ధతిలోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నాయకులు చంటి, శివాజీ, అంజి, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు

పాత పద్ధతిలోనే మెరిట్ జాబితా ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పాత పద్ధతిలోనే డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల చేయాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అర్హత పొందిన అభ్యర్థుల జాబితా విడుదల చేయకుండా వారికి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపడం ఎందుకోసమో చెప్పాలని డిమాండ్ చేశారు. పూర్తి పారదర్శకతకు పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'జిల్లాకు దామోదరం పేరు సముచితం'

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరును ప్రతిపాదించడం సముచితమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం బిర్లా కంపౌండ్‌లోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో.. కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆయన ప్రజా సంఘాల నాయకులతో కలసి ఆవిష్కరించారు. కర్నూలుకు దామోదరం పేరును పెట్టాలని కోరుతూ దశలవారీ పోరాటాలకు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా కరపత్రాలను విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంజీవయ్య జిల్లా సాధన సమితి నాయకులు దాసరి రామశేషయ్య, జే.వీ.కృష్ణయ్య, నాగభూషణం, దామోదరం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆలూరు నియోజకవర్గం చిగిలి గ్రామంలోలో 5వ తరగతి విద్యార్థులు ఆరుగురు నీటి కుంటలో పడి చనిపోవడం బాధాకరమని, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున సానుభూతి తెలుపుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు.

- కర్నూలు(సెంట్రల్): ఆస్పరి మండలం చిగిలిలో నీటి కుంటలో పడి చనిపోయిన ఆరుగురు విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు సీపీఐ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటించారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో విస్తృత హరితీకరణ కార్యక్రమంలో భాగంగా వేలాది మొక్కలను నాటుతున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించి విరివిగా మొక్కలు నాటాలన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని పంప్ హౌస్ వద్ద కానుగ, సీతాఫల్, బాదం, వేప, రెయిన్ ట్రీ తదితర మొక్కలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల నుంచి ఇప్పటివరకు 10 వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. మొక్కలను ఇళ్ల పరిసర ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో నాటాలని పిలుపునిచ్చారు.

ఇంజినీరింగ్ విభాగంలో మారని తీరు

- ఎస్‌టీపీల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం
- మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, ఇద్దరు ఇంజినీర్లకు మెమోలు

కర్నూలు (టౌన్): నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారుల పనితీరు మారడం లేదు. ఇప్పటికే పలుమార్లు కమిషనర్ పి.విశ్వనాథ్.. ×మున్సిపల్ ఎస్ఈ పీవీ.శేషసాయిని యూఆర్ అన్ ఫిట్, పర్యవేక్షణ లేదు×.. పాలనపరంగా ఇబ్బందులు పడుతున్నామంటూ హెచ్చరించారు. అయినా ఈ శాఖలో ఎలాంటి మార్పు లేదు. పైగా కర్నూలు నగరంలో పర్యావరణ కాలుష్యం విపరీతంగా ఉందని, వెంటనే ఇక్కడ ఎస్‌టీపీలను ఏర్పాటు చేసుకొని నదుల్లో కాలుష్యాన్ని అరికట్టాలని చెన్నైకు చెందిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు కర్నూలులో ఏర్పాటు చేసిన ఎస్‌టీపీల పర్యవేక్షణను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు గాలికి వదిలేశారు. రెండు ఎస్‌టీపీలు పని చేయడం లేదు. దీంతో మండిపడిన కమిషనర్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎస్ఈ శేషసాయితో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ సీవీఆర్. వైష్ణవిలకు మెమోలు జారీ చేశారు. ముగ్గురు ఇంజినీర్లు రాతపూర్వకంగా కారణాలు తెలియజేయాలని, లేని పక్షంలో శాఖ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌టీపీలు పనిచేయకున్నా పట్టించుకొని ఎస్ఈ

నగరపాలక సంస్థ పరిధిలో కేసీ కెనాల్, తుంగభద్ర, హంద్రీ నదులు ఉన్నాయి. అనేక ప్రాంతాలు, కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు ఈ నదుల్లో కలుస్తుంది. దీని వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని 2022లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నగరపాలక సంస్థ అధికారులను హెచ్చరించింది. అందులో భాగంగా ప్రజారోగ్య సాంకేతిక శాఖ అధికారులు నగరంలోని జమ్మిచెట్టు వద్ద 0.8 ఎంఎల్‌డీ, తుంగభద్ర పాత పంపింగ్ హౌస్ వద్ద 0.8 ఎంఎల్‌డీ, సంకల్‌బాగ్ వద్ద 0.8 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీలను (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు) అప్పట్లోనే ఏర్పాటు చేశారు. అయితే జమ్మిచెట్టు వద్ద ఉన్న ఎస్‌టీపీ, తుంగభద్ర పాత పంపింగ్ స్టేషన్ వద్ద ఉన్న ఎస్‌టీపీలు చాలా కాలంగా పనిచేయడం లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ ఎస్ఈ కనీసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడంతో పాటు పర్యవేక్షణ చేయకపోవడం, తనకు సంబంధం లేనట్లు వ్యవహరించడంపై కమిషనర్ సీరియస్ అయ్యారు. పర్యావరణ కాలుష్యం అరికట్టడంలో విఫలమయ్యారంటూ ఇప్పటికే రూ.5.2 కోట్ల అపరాధ రుసుం విధించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సీరియస్‌గా స్పందించినా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



పనిచేయని మురుగు నీటి శుద్ధి కేంద్రం







ముస్తాబవుతున్న గణనాథులు

ఈనెల 27వ తేదీన వినాయక చవితి పురస్కరించుకుని కర్నూలు నగర వీధుల్లో కొలువుదీరేందుకు వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. శివపార్వతులు, ఛత్రపతి శివాజీ, దశావతార రూపం, చిన్ని కృష్ణుడు, నెమలి, ఎనుగులు, బసవన్నలపై, ఆశ్వాలపై ఊరేగింపుగా వెళ్తున్న వినాయక ప్రతిమలకు కళాకారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. విభిన్న రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఉత్సవ సమితి నిర్వాహకులు తరలివస్తున్నారు. ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన వారు విగ్రహాలను వారి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం సుందరయ్య భవన్‌లో మాట్లాడుతూ.. జిల్లాలోని 9 మండలాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆయా రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రధానంగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, టమోటా, ఉల్లి, పచ్చిమిర్చి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆయా పంటలకు ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన అన్నదాతలు వర్షాలతో నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పెద్దకడబూరు మండలం పులికనుమ గ్రామంలో దాదాపు 24 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ముందుకు కదలడం లేదని, కనీసం పంటనష్టం వివరాలు కూడా వారి వద్ద లేకపోవడం అన్యాయమన్నారు. అలాగే ఆస్పరి మండలం వలగొండ గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు మాట్లాడుతూ.. ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షాలకు వందల క్వింటాళ్ల వేరుశనగ దిగుబడులు నీటిపాలయ్యాయన్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.